
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తమిళనాడు

TAMILNADU

సోమవారం 6 జనవరి 2025

సింధులోయ లిపికి సులభశైలి అందిస్తే

భారీ నజరానా

అంతర్జాతీయ సదస్సులో సీఎం స్టాలిన్

చెన్నై, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సింధులోయ నాగరికతకు సంబంధించిన లిపిని నేటి లిపితో అన్వయం చేసుకోగలిగిన, ఆ లిపిని సుస్పష్టంగా అర్థం చేసుకునే మార్గాలను అన్వేషించే సంస్థ లేదా వ్యక్తికి ఒక మిలియన్ అమెరికన్ డాలర్లను బహుమానంగా అందజేస్తామని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. అదే విధంగా శిలాశాసనాల పరిశోధకులను ప్రోత్సహించేలా ఇద్దరు పురావస్తు పరిశోధకులను ఎంపికచేసి అవార్డులు ఇస్తామని, పురావస్తు పరిశోధకుడు దివంగత తమిళ పాత్రికేయ దిగ్గజం ఐరావతం మహాదేవన్ పేరుతో పరిశోధన పీఠం ఏర్పాటుకు రూ.2 కోట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. ఎగ్మూరు ప్రభుత్వ మూజియం హాలులో సింధులోయ నాగరికత ఆవిష్కరణ శతవార్షికోత్సవాల ముగింపు వేడుకల ప్రారంభోత్సవ సందర్భంగా ఆదివారం అంతర్జాతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సింధులోయ నాగరికతను కనుగొని ప్రపంచానికి చాటిచెప్పిన సర్ జాన్ మార్షల్ విగ్రహం ఏర్పాటు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతమున్నదని ఓ పార్టీ ప్రభుత్వం కాదని, ఓ జాతి పరిపాలన అని, దేశంలో మరే చోటా సింధులోయ నాగరికతపై సదస్సు నిర్వహించిన దాఖలాలు లేవని, సింధులోయ నాగరికతలో ద్రావిడ భాష మాట్లాడి ఉండవచ్చునని చెబుతున్నారన్నారు. సింధులోయ నాగరిత మొదటిసారిగా 1924లో ప్రపంచానికి తెలిసిందని, ఆ నాగరికతను లోకానికి ఎలుగెత్తి చాటింది సర్ జాన్ మార్షల్ అని వివరించారు. ఇక సింధులోయ నాగరికతకు సంబంధించిన చిహ్నాలను బహిర్గతపరచిన ఘనత మాజీ ముఖ్యమంత్రి అన్నాదురై, సెమ్మొళి మహానాడులో సింధులోయ నాగరికత ప్రాశస్త్యాన్ని చాటింది మరో మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి మాత్రమేనని చెప్పారు. ప్రస్తుతం శివగంగ జిల్లాలో కీళడి తవ్వకాలు ప్రపంచ దేశాలన్నింటిని ఆకట్టుకుంటున్నాయన్నారు. కీళడిలాగే పొరునై వద్ద కూడా మ్యూజియం పనులు జరుగుతున్నాయని ఈ సందర్భంగా స్టాలిన్ వెల్లడించారు. సింధులోయ నాగరికతపై పరిశోధనలు కూడా ప్రపంచ దేశాలను ఆకట్టుకుంటున్నాయని, సింధులోయ చిహ్నాలు, కీళడి ప్రాంతం చిహ్నాలు 60 శాతం వరకూ ఒకేలా ఉంటున్నాయని స్టాలిన్ ప్రకటించారు.

మంత్రి తంగం తెన్నరసు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో మంత్రులు ఎం.సామినాథన్, పీకే శేఖర్‌బాబు, ద్రావిడ కళగం నేత కే వీరమణి, మేయర్ ఆర్.ప్రియ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం, ప్రముఖ పురావస్తు పరిశోధక నిపుణులు గ్రెక్‌జామినసన్, రాజన్, నయన్‌జోత్ లహిరి, బాలకృష్ణన్, డోనీ జేకబ్, దేశవిదేశాల నుండి సుమారు 20 మంది ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో బ్రిటిష్ ఇండియా పురావస్తు పరిశోధకుడు సర్ జాన్ మార్షల్ విగ్రహ ప్రతిష్ఠకు శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి

నేటి నుంచి అసెంబ్లీ

గవర్నర్ ప్రసంగంతో సమావేశాలు ప్రారంభం



ప్యారీస్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరంలో అసెంబ్లీ తొలి సమావేశాలు సోమవారం ఉదయం గవర్నర్ ఆర్‌ఎన్ రవి ప్రసంగంతో ప్రారంభం కానున్నాయి. గవర్నర్ ఆంగ్ల ప్రసంగాన్ని అసెంబ్లీ స్పీకర్ అప్పావు తమిళంలో చదివి వినిపించనున్నారు. గత ఏడాది చివరలో రాష్ట్రంలో కలకలం రేపిన సంఘటనల అనంతరం జరుగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ఈసారి వాడి వేడి చర్చలు కూడా జరిగే అవకాశముంది. అన్నా వర్సిటీలో విద్యార్థిని లైంగిక వేధింపుల వ్యవహారంపై చర్చలకు అనుమతించాలని డీపీఐ సావధాన తీర్మానంకు అవకాశం కోరుతూ స్పీకర్‌కు నోటీసు ఇచ్చింది. ఈ సమావేశంలో పొంగల్ కానుకకు సంబంధించి ప్రతపక్ష పార్టీలు ప్రభుత్వాన్ని నిలదీస్తాయని సమాచారం. కాగా, అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలన్న దానిపై సభా వ్యవహారాల కమిటీ చర్చించి నిర్ణయం తీసుకుంటుంది. ఈ నేపథ్యంలో, అసెంబ్లీ సమావేశాలు సోమవారం ప్రారంభం కానున్న నేపథ్యంలో, స్పీకర్ అప్పావు శనివారం రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌ను కలిసి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభించాలని ఆహ్వానించారు. స్పీకర్‌తో పాటు అసెంబ్లీ కార్యదర్శి శ్రీనివాసన్ కూడా ఉన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో లేవనెత్తాల్సిన సమస్యలు, మాట్లాడాల్సిన అంశాల గురించి ప్రతిపక్ష ఎమ్మెల్యేలు సమావేశమై నిర్ణయం తీసుకున్నారు. తొలిరోజు సమావేశంలో ఇటీవల మరణించిన భారత మాజీ ప్రధాని డా.మన్మోహన్ సింగ్, ఈరోడ్ తూర్పు నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఈవీకేఎస్ ఇళంగోవన్ మృతికి సంతాపం తెలిపి సభ వాయిదావేయనున్నారు. మళ్లీ బుధ, గురువారాల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చలు కొనసాగుతాయి. రాష్ట్ర ప్రభుత్వం తరఫున కొన్ని కీలక ముసాయిదా బిల్లులు ప్రవేశపెట్టనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా దుమారం రేపిన అన్నా వర్సిటీ విద్యార్థిని అత్యాచార ఘటనపై అన్నాడీఎంకే, బీజేపీ, పీఎంకే వంటి ప్రతిపక్షాలు మాత్రమే కాకుండా డీఎంకే కూటమిలో భాగస్వామ్యం వహిస్తున్న సీపీఎం, సీపీఐ కూడా నిలదీసే అవకాశముంది. అలాగే, రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్యపై కూడా ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టే అవకాశాలున్నాయి.

అన్నా విశ్వవిద్యాలయంలో

కొత్త నిబంధనలు

● యూనివర్సిటీ ప్రాంగణంలో సైకిళ్లకు మాత్రమే అనుమతి



పెరంబూర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండిలోని అన్నా విశ్వవిద్యాలయంలో విద్యార్థులు సైకిళ్లు మాత్రమే వినియోగించాలి సహా పలు నిబంధనలు విధించారు. గిండి వర్శిటీలో విద్యార్థినిపై అత్యాచారం జరిగిన ఘటన తీవ్రంగా చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో, వర్సిటీ ప్రాంగణంలో చేపట్టాల్సిన నిబంధనలను ఆదివారం వర్శిటీ రిజిస్ట్రార్ ప్రకటన విడుదల చేశారు. ఆ నిబంధనలు ఇలా ఉన్నాయి...

- వర్సిటీ ప్రాంగణంలో విద్యార్థులు సైకిళ్లు మాత్రమే వినియోగించాలి.
- విద్యార్థులు, ప్రొఫెసర్లు, వర్సిటీ ఉద్యోగులను మాత్రమే ప్రాంగణంలోకి అనుమతించాలి.
- బయట వ్యక్తులు ప్రాంగణంలో వాకింగ్ చేసేందుకు నిషేధం.
- సాయంత్రం, రాత్రి సమయాల్లో వర్సిటీ ప్రాంగణంలో భద్రతా సిబ్బంది పెట్రోలింగ్ చేయాలి.
- పని పూర్తయిన తరువాత భవన నిర్మాణ కార్మికులు బయటకు వెళ్లిపోవాలి.
- వర్సిటీ ప్రాంగణంలో అనుమతి లేని వాహనాలు నిలిపితే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- విద్యార్థులు గుర్తింపు కార్డు ధరించాలి.
- సీసీ కెమెరాలు, వీధి దీపాలు పనిచేస్తున్నట్లు నిర్ధారించుకోవాలి.
- లైంగిక వేధింపుల వ్యతిరేక కమిటీ ప్రతి నెలా సమావేశమై, విద్యార్థుల అభిప్రాయాలు తెలుసుకోవాలి తదితర నిబంధనలు విధించినట్లు వర్శిటీ రిజిస్ట్రార్ పేర్కొన్నారు.

తిరువణ్ణామలైలో

ఉత్తరాయణ బ్రహ్మోత్సవాల ప్రారంభం

చెన్నై, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన శైవ క్షేత్రం తిరువణ్ణామలైలోని అరుణాచలేశ్వరాలయంలో ఆదివారం ఉదయం ఉత్తరాయణ బ్రహ్మోత్సవ వేడుకలు ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ముందుగా సర్వాలంకరణ శోభితులై ఉన్నాములై అమ్మవారి సమేత అరుణాచలేశ్వరస్వామి మంగళవాయిద్యాలు, శైవాగమ పండితుల మంత్రోచ్చారన నడుమ ధ్వజస్తంభ మండపానికి వేంచేశారు. ఆ తర్వాత శైవగామపండితులు, ఆలయ ప్రధానార్చకులు మంగళవాయిద్యాల నడుమ ధ్వజస్తంభంపై ఉత్సవ పతాకాన్ని ఎగురవేశారు. ఈ వేడుకల్లో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. ఈ వేడుకలను పురస్కరించుకుని ఆలయాన్ని వేకువజామునే తెరచి సంబంధ వినాయకుడు, ఉన్నామలై సమేత అరుణాచలేశ్వరస్వామికి ప్రత్యేక ఆరాధన నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ డిప్యూటీ కమిషనర్ సి.జ్యోతి, ట్రస్టు బోర్డు సభ్యుడు ఇరా జీవానందం తదితరులు పాల్గొన్నారు. ఉత్తరాయణ పుణ్యకాల బ్రహ్మోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆదివారం నుంచి ఉత్సవాలు ముగిసేంతవరకు రోజూ ఉదయం, సాయంత్రం స్వామి, అమ్మవార్లు ఆలయ మాఢవీధులలో ఊరేగి భక్తులను అనుగ్రహించనున్నారు. పశువుల పండుగ సందర్భంగా స్వామి, అమ్మవార్లు ఆలయ తిట్టివాసల్ గుండా సూర్యభగవానుడికి దర్శనమిచ్చి, మాడవీధిలో ఊరేగనున్నారు. మాడవీధిలో మూడుసార్లు ప్రదక్షిణ చేసిన తర్వాత సాయంత్రం తిరువూడల్ (బుజ్జగింపుల పర్వం) కార్యక్రమం నిర్వహించనున్నారు. అదే రోజున ఆలయంలోని నందీశ్వరుడిని వివిధ రకాల కాయగూరలతో అలంకరించి వివిధ రకాల ఫలహారాలను నైవేద్యంగా సమర్పించనున్నారు. ఈ ప్రత్యేక అలంకారంలో నందీశ్వరుడు భక్తులను అనుగ్రహించనున్నారు.





ధ్వజారోహణం చేస్తున్న ఆలయ ప్రధానార్చకులు - సర్వాలంకరణ శోభితంగా ఉన్నాములై అమ్మవారి సమేత అరుణాచలేశ్వరస్వామి

స్టాన్లీ ఆస్పత్రిలో

జ్ఞానశేఖరన్ విచారణ

● అశ్లీల వీడియోలపై భార్యల ఆరా

● ల్యాప్‌టాప్ స్వాధీనం



నిందితుడు జ్ఞానశేఖరన్

అడయార్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): అన్నా విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన కేసులో ప్రధాన నిందితుడు జ్ఞానశేఖరన్ ను సిట్ అధికారులు విచారణ జరిపారు. అతడి ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్లలో ఉన్న అశ్లీల వీడియోల విషయంపై ఇద్దరు భార్యల నుంచి వాంగ్మూలం తీసుకుని, ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నారు. గత నెల 24న అన్నా వర్సిటీ విద్యార్థినిపై జ్ఞానశేఖరన్ అత్యాచారానికి పాల్పడిన సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనమైంది. దీంతో మద్రాస్ హైకోర్టు ఈ కేసును సుమోటాగా స్వీకరించిన విచారణ చేపట్టడంతో పాటు ముగ్గురు మహిళా ఐపీఎస్ అధికారులతో సిట్ కూడా ఏర్పాటు చేసింది. ఇదిలావుంటే, కాలు విరిగి స్టాన్లీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నిందితుడు జ్ఞానశేఖరన్ వద్ద ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు శనివారం విచారణ జరిపారు తర్వాత అతడి ఇద్దరు భార్యలు విక్టోరియా, చాయా వాంగ్మూలం కూడా సేకరించారు. అలాగే, కోట్టూరుపురంలోని నిందితుడి ఇంటికి వెళ్ళి తనిఖీ చేజి ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకుని పరిశీలించారు. అందులో అశ్లీల వీడియోలను గుర్తించిన అధికారులు పూర్తి వివరాల సేకరణ కోసం ల్యాబ్‌కు పంపించారు. ఆ అశ్లీల వీడియోల్లో జ్ఞానశేఖరన్ తన భార్యలతో గడుపుతున్న వీడియోలు కూడా ఉన్నట్టు గుర్తించారు. మరోవైపు, జ్ఞానశేఖరన్ ఉపయోగించే జీప్, వ్యానును ఈఎంఐ చెల్లించకపోవడంతో ఫైనాన్స్ కంపెనీలు స్వాధీనం చేసుకున్నాయి. తన అసాంఘిక కార్యక్రమాలకు ఉపయోగించే బైకు మాత్రం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

సచివాలయం, డీజీపీ కార్యాలయానికి బాంబు బెదిరింపు

పెరంబూర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సచివాలయం, డీజీపీ కార్యాలయానికి బాంబు బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి కోసం పోలీసులు విచారిస్తున్నారు. రాష్ట్ర శాసనసభ సమావేశాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో, ఆదివారం సచివాయం, డీజీపీ కార్యాలయాలకు బాంబు బెదిరింపు ఫోన్‌కాల్ వచ్చింది. సమాచారం అందుకున్న పోలీసులు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో సచివాలయం, డీజీపీ కార్యాలయాలకు చేరుకొని పరిశీలించారు. ఎలాంటి పేలుడు పదార్థం లభ్యం కాకపోవడంతో బెదిరింపు ఫేక్ కాల్‌గా నిర్ధారించిన పోలీసులు, కాల్ నెంబరు ఆధారంగా బెదిరింపు పాల్పడిన వారి కోసం విచారిస్తున్నారు.

నేడు ఓటర్ల తుది జాబితా విడుదల

అడయార్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఓటర్ల తుది జాబితాను ఎన్నికల అధికారులు సోమవారం విడుదల చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు చేపట్టారు. ఇవన్నీ విజయంతంగా పూర్తి కావడంతో తుది జాబితాను సోమవారం విడుదల చేయనున్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశం మేరకు 2024 ఆగస్టు 20 నుంచి అక్టోబరు 18 వరకు కొత్త ఓటర్ల చేర్పు, సవరణలు, చిరునామా మార్పు చేపట్టారు. ఆ తర్వాత అక్టోబరు 29 న ముసాయిదా జాబితా విడుదల చేశారు. ఇందులో ఉండే తప్పొప్పులను సరిచేసేందుకు వీలుగా నవంబరు 16, 17, 23, 24వ తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 69 వేల పోలింగ్ బూత్‌లలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు.. ఈ నేపథ్యంలో తుది ఓటర్ల జాబితాను సిద్ధం చేసిన అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం విడుదల చేయనున్నారు.



జన్మదినం సందర్భంగా చెన్నై క్యాంపు ఆఫీసులో తనను కలిసిన సోదరి, ఎంపీ కనిమొళికి శుభాకాంక్షలు తెలుపుతున్న ముఖ్యమంత్రి, ఎంకే స్టాలిన్

ముగిసిన ప్రజా ప్రతినిధుల

పదవీకాలం

● ప్రత్యేక అధికారులను నియమించాలని నిర్ణయం

పెరంబూర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 1.19 లక్షలమంది స్థానిక ప్రజా ప్రతినిధుల పదవీకాలం ఆదివారంతో ముగిసింది. వార్డుల పునర్విభజన అనంతరం ఖాళీయైన స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహిస్తామని హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం తెలియజేసినందున, ఖాళీయైన స్థానిక సంస్థలకు ప్రత్యేక అధికారులు నియమించనున్నట్లు సమాచారం. గత అన్నాడీఎంకే హయాంలో కొత్తగా ఏర్పాటుచేసిన కాంచీపురం, చెంగల్పట్టు, విల్లుపురం, కళ్లకుర్చి.. వేలూరు, తిరుపత్తూర్, రాణిపేట, తిరునల్వేలి, తెన్‌కాశి తదితర 9 జిల్లాలు మినహా, 27 జిల్లాల్లో ఉన్న 1.19 లక్షల గ్రామ పంచాయతి, యూనియన్ పంచాయతి, జిల్లా పంచాయతీల ప్రతినిధులకు 2019లో ఎన్నికలు నిర్వహించారు. అధికారం మారిన తర్వాత, మిగిలిన జిల్లాల్లో 2021లో స్థానిక ఎన్నికలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో, 2019లో ఎన్నికలు జరిగిన స్థానిక సంస్థల పదవీకాలం ఆదివారంతో ముగిసింది. అలాగే, 2021లో స్థానిక ఎన్నికలు నిర్వహించిన జిల్లాల్లో 2026 సెప్టెంబరులో పదవీకాలం ముగియనుంది.

స్థానిక సంస్థల అనుసంధానం...

ఈ క్రమంలో, పట్టణ ప్రాంతాలకు ఆనుకొని ఉన్న గ్రామ పంచాయతీలను పట్టణ స్థానిక సంస్థలతో అనుసంధానం చేస్తున్నారు. అందువల్ల, ప్రజా ప్రతినిధుల పదవీకాలం ముగిసిన స్థానిక సంస్థలకు, ప్రత్యేక అధికారులను నియమించే తీర్మానం, శాసనసభ సమావేశాల్లో సోమవారం ప్రవేశపెట్టనున్నారు. ఈ విషయమై గ్రామీణాభివృద్ధి, స్థానిక సంస్థల శాఖ అధికారులు మాట్లాడుతూ.. 16 కార్పొరేషన్లలో విలీనం చేయనున్న 149 పంచాయతీలు, 16 మున్సిపాలిటీల్లో విలీనం చేయనున్న 147 పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించనున్నారని తెలిపారు. అలాగే, నగర పంచాయతీలు, మున్సిపాలిటీల్లో విలీనం కానున్న గ్రామ పంచాయతీలకు కూడా ప్రత్యేక అధికారులను నియమించనున్నట్లు, గ్రామ పంచాయతీలు అధికారికంగా పట్టణ స్థానిక సంస్థల్లో విలీనం చేసే వరకు వీరు ప్రత్యేక అధికారులుగా వ్యవహరించనున్నట్లు వారు వివరించారు.

ఈడీ దాడుల నేపథ్యం..

హస్తినకు దురైమురుగన్ పయనం



చెన్నై, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కాట్పాడిలోని తన నివాసంలో రెండు రోజులపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం (ఈడీ) అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించిన నేపథ్యంలో సీనియర్ మంత్రి దురైమురుగన్ శనివారం రాత్రి ఆకస్మికంగా ఢిల్లీ వెళ్లారు. ఈ నెల 3న కాట్పాడి నివాసానికి 25 మంది ఈడీ అధికారులు దాడులు జరిపేందుకు వెళ్ళారు. ఆ సమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవడం, అక్కడ నివసిస్తున్న దురైమురుగన్ తనయుడు, ఎంపీ కదిర్‌ఆనంద్ కుటుంబ సమేతంగా దుబాయ్‌లో ఉండటంతో అధికారులు ఆయనను ఫోన్‌లో సంప్రదించి, డీఎంకే స్థానిక నాయకులు ముగ్గురి సమక్షంలో ఆ ఇంటిలో తనిఖీలు ప్రారంభించారు. అదే సమయంలో కదిర్ ఆనంద్ నడుపుతున్న కింగ్‌స్టన్ ఇంజనీరింగ్ కాలేజీలో కోట్లాది రూపాయల నగదు లభించింది. ఆ నగదుకు సంబంధించి జమాపద్దులు పరిశీలించిన మీదట తిరిగిచ్చేలా ఆ నగదును ఎస్‌బీఐ బ్రాంచిలో డిపాజిట్ చేశారు. ఈడీ దాడులు ముగిసిన నేపథ్యంలో దురైమురుగన్, డీఎంకే ఎంపీ జగద్రోగన్‌తో కలిసి ఢిల్లీ వెళ్లారు. దురైమురుగన్ పర్యటన అధికారమైనదా? లేక వ్యక్తిగతమైనదా? అనే విషయంపై అటు అధికారులు, ఇటు పార్టీ నేతలు ఎలాంటి ప్రకటన చేయలేదు.

ఆ పర్యటన వెనుక ఆంతర్యమేమిటో?

ఇదిలా ఉండగా మంత్రి దురైమురుగన్ ఢిల్లీ పర్యటన వెనుక రహస్యమేమిటో వెల్లడించాలని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత డిమాండ్ చేశారు. దురైమురుగన్ నివాసంలో ఈడీ అధికారులు చాలా ఆలస్యంగా దాడులు జరిపారని ఆమె అన్నారు. ఆదివారం ఆమె తిరువణ్ణామలైలో అరుణాచలేశ్వరుడిని దర్శించారు. ఆ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, ఎవరికీ భద్రతలేదన్నారు. దురైమురుగన్ ఇంటిలో, ఆయన తనయుడు కదిర్ ఆనంద్ కాలేజీలో స్వాధీనం చేసుకున్న నగదు, రికార్డుల వివరాలను ఈడీఅధికారులు ప్రకటించాలన్నారు. ఈడీ దాడుల నేపథ్యంలో ఎవరినో బుజ్జగించేందుకు దురైమురుగన్ ఢిల్లీ వెళ్లినట్లు తెలుస్తోందని ప్రేమలత ఎద్దేవా చేశారు.

సమాచార దర్శిని

ఉపకారవేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తొమ్మిది నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు కేంద్రప్రభుత్వం ఉపకార వేతనం అందజేస్తోంది. అందుకోసం 8వ తరగతి విద్యార్థులకు దేశీయ స్థాయిలో పరీక్ష నిర్వహించి ఎంపిక చేయనుంది. ఎంపికైన విద్యార్థులకు 9 నుంచి ప్లస్ టూ వరకు మూడేళ్ల నెలకు రూ.1,000 అందజేస్తోంది. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 27వ తేదిలోపు తమ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

మమతకు సీఎం స్టాలిన్ జన్మదిన శుభాకాంక్షలు

పెరంబూర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆదివారం తన 69వ జన్మదినం జరుపుకున్నారు. ఆమకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ సీఎం స్టాలిన్ ప్రకటన విడుదల చేశారు. "పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, నా ప్రియమైన సోదరి మమతా బెనర్జీకి పుట్టినరోజు శుభాకాంక్షలు. ప్రజాసేవ పట్ల మీ నిబద్ధత సానుకూల మార్పు తీసుకురావాలి. మీకు ఆనందం, ఆరోగ్యం, విజయాలతో కూడిన సుదీర్ఘజీవితాన్ని కోరుకుంటున్నాను" అంటూ సీఎం శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధ్యాయులకు ఆంగ్లంపై శిక్షణ

పెరంబూర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఆంగ్లంపై శిక్షణ ఇవ్వనున్నారు. బెంగళూరులోని 'రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్' కేంద్రంలో ఈ నెల 16 నుంచి 30 రోజులు శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం విద్యా జిల్లాకు ఒకరు చొప్పున 50 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. దశలవారీగా ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు అందరికీ ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు పాఠశాల విద్యాశాఖ తెలిపింది.

పాఠశాలల వార్షికోత్సవాలకు రూ.14 కోట్లు

పెరంబూర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ పాఠశాలల్లో వార్షికోత్సవాలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.14 కోట్లు కేటాయించింది. ఈ నెల, ఫిబ్రవరి నెలల్లో ఉన్నత, మహోన్నత పాఠశాలల్లోను, ఈ నెల నుంచి మార్చి వరకు ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో వార్షికోత్సవాలు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఈ వేడుకల నిర్వహణకు రూ.14 కోట్లు కేటాయిస్తూ శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

ఆన్‌లైన్‌లోనే ఆవిన్ పాలు, ఐస్‌క్రీమ్స్

ఐసిఎఫ్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆవిన్ పాల ఉత్పత్తులను ఆన్‌లైన్లో బుక్ చేసుకొనే వెసులుబాటు కల్పిస్తోంది. ప్రజలు శుభకార్యాలకు, దుకాణదారులు వ్యాపారానికి ఆవిన్ కంపెనీ తయారు చేస్తున్న 75 రకాల ఐస్‌క్రీమ్స్, పాలు, పెరుగు, నెయ్యి తదితర పదార్థాలు ఇకనుండి మొబైల్ ద్వారా ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసుకొనే సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు ఆవిన్ నిర్వాహణా అధికారి వినిత్ తెలిపారు. వివరాలకు 9944353459 నెంబర్‌ను సంప్రదించాల్సిందిగా ఆయన అన్నారు.

మదురై జిల్లాలో జల్లికట్టు ఏర్పాట్లు

ప్యారీస్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): తమిళ సంప్రదాయ సాహస జల్లికట్టు పోటీల నిర్వహణకు పేరున్న మదురై జిల్లాలో ఈనెల 14 నుంచి 16 వరకు పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. 14న అవనియాపురం, 15న పాలమేడు, 17న అలంగానల్లూరు ప్రాంతాల్లో నిర్వాహించదలచిన పోటీల్లో పాల్గొననున్న ఎద్దులు, యువకులకు శిక్షణ ఇస్తున్నారు. సోమవారం నుంచి ముందస్తు పేర్ల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు జిల్లా యంత్రాంగం తెలిపింది.

కొచ్చిన్ విమానంలో సాంకేతికలోపం

పెరంబూర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనంబాక్కం విమానాశ్రయం నుంచి కొచ్చిన్ వెళ్లాల్సిన విమానంలో సాంకేతికలోపం తలెత్తింది. ఆదివారం ఉదయం 89 మంది ప్రయాణికులతో కొచ్చిన్ వెళ్లేందుకు విమానం సిద్ధంగా ఉండగా, పైలెట్ చివరి తనిఖీ సమయంలో సాంకేతికలోపాన్ని గుర్తించాడు. ఈ విషయాన్ని అధికారులకు తెలియజేయడంతో, విమానాన్ని నిలిపివేసి, ప్రయాణికులను దింపి విమానాశ్రయంలోని విశ్రాంతి గదులకు తరలించారు. సాంకేతిక నిపుణుల మరమ్మతుల అనంతరం రెండు గంటల ఆలస్యంగా విమానం బయల్దేరి వెళ్లింది.

రోడ్డు ప్రమాదంలో మాజీ నేవీ అధికారి మృతి

ఐసిఎఫ్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో నేవీ అధికారి మృతిచెందిన ఘటన కోయంబేడు ప్రాంతంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే అన్నా నగర్ ప్రాంతానికి చెందిన రాజేంద్రన్ (68) శనివారం ఉదయం ఇంటి నుండి తన ద్విచక్ర వాహనంపై బయలుదేరి పూందమల్లి హైవే రోడ్డులో వెళ్తుండగా మదురవాయల్ బస్టాప్ వద్ద లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న కోయంబేడు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకొని, రాజేంద్రన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించారు.

భరతనాట్యం గొప్పదనాన్ని గౌరవించాలి

- కలైమామణి బాలాదేవి చంద్రశేఖర్


డిజిటల్ ఆడియోను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

అడయార్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): భరతనాట్య కచేరీల్లో ప్రధానమైన నృత్య కూర్పుల గొప్పతనాన్ని గౌరవించడం, కాపాడటం ఎంతో ముఖ్యమని ఇందుకోసం తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని కలైమామణి బాలాదేవి చంద్రశేఖర్ అన్నారు. 'యాన్ ఓల్డ్ ఆఫ్ ది తంజావూర్ క్వార్టెట్ - ఏ ట్రెడిషినల్ మార్గమ్' అనే పేరుతో రూపొందిన డిజిటల్ ఆడియో ఆవిష్కరణ ఆదివారం జరిగింది. మైలాపూర్‌లోని టీఏజీ దక్షిణామూర్తి హాలులో జరిగిన ఓ కార్యక్రమంలో న్యూఢిల్లీలోని సంగీత నాటక అకాడెమీ ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు, కలైమామణి నందిని రమణి, ప్రముఖ వస్త్ర వ్యాపారవేత్త నల్లి కుప్పుస్వామి చెట్టి పాల్గొని రిలీజ్ చేశారు. ఇందులో కలైమామణి బాలాదేవి చంద్రశేఖర్ మాట్లాడుతూ, 'ఇది సాంప్రదాయ భరతనాట్య మార్గం, నృత్య ఉపచార శ్రేణి కొనసాగిస్తుందని, ఈ వినూత్న ప్రాజెక్టు సంప్రదాయ భరతనాట్య అవగాహనలో కొత్త పునరుజ్జీవనానికి దారితీసే లక్ష్యంతో ఉందని, నందిని రమణి మార్గదర్శకత్వంలో దీన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు.

కలెక్టర్ కార్యాలయం వద్ద పోలీసు భద్రత


మహిళను విచారిస్తున్న పోలీసులు

పెరంబూర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటైంది. ఈ కార్యాలయం సమస్యలు తెలిపేందుకు వచ్చే ప్రజలతో కార్యాలయం ప్రతిరోజు సందడిగా ఉంటుంది. ఈ నేపథ్యంలో, స్థానిక పల్లావారానికి చెందిన బాబు, తన స్థలం సమస్యపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదంటూ రెండు రోజుల క్రితం కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో, జిల్లా ఎస్పీ సాయిప్రణీత్ ఉత్తర్వులతో, కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఎస్‌ఐ నేతృత్వంలో ఒక మహిళా కానిస్టేబుల్ సహా ముగ్గురు ముగ్గురితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఏటీఎం ధ్వంసం చేసి రూ.7 లక్షల చోరీ

పెరంబూర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మైలాడుదురై జిల్లా శీర్గాళిలో ఉన్న ఏటీఎం యంత్రం బద్దలుకొట్టిన ఆగంతకులు రూ.7.42 లక్షలు దోపిడీ చేసి పరారయ్యారు. శీర్గాళి సమీపం మేల్‌సాలై గ్రామంలో ఇండియన్ బ్యాంక్ శాఖ , ఏటీఎం కేంద్రం ఉన్నాయి. ఈ బ్యాంకు రోడ్డు నుంచి కొంచెం లోపలకు ఉండడంతో, జనసంచారం తక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో, ఆదివారం వేకువజామున 1 గంట ప్రాంతంలో ముసుగు ధరించిన ముగ్గురు వ్యక్తులు ఏటీఎం కేంద్రంలోకి ప్రవేశించి, గడ్డపారతో యంత్రాన్ని బద్దలుకొట్టి రూ.7.42 లక్షలు దోచుకొని పరారయ్యారు. ఆగంతకులు తొలుత సీసీ కెమెరాలు ధ్వంసం చేయడంతో పాటు విద్యుత్ కనెక్షన్ తొలగించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి ఆగంతకుల కోసం గాలిస్తున్నారు.

10 టన్నుల ప్లాస్టిక్ సంచుల స్వాధీనం

ఐసిఎఫ్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మాంగాడు ప్రాంతంలోని దుకాణాల్లో ఉపయోగిస్తున్న ప్లాస్టిక్ సంచులను మున్సిపల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్రప్రభుత్వం బ్యాన్ చేసిన ప్లాస్టిక్ సంచులు, టీకప్పులు మాంగాడు ప్రాంతంలోని దుకాణాల్లో అమ్ముతున్నట్లు ప్రజలు మాంగాడు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో మున్సిపల్ కమిషనర్ నందిని నేతృత్వంలో శుక్రవారం మాంగాడు ప్రాంతాల్లోని పలు దుకాణాల్లో ప్లాస్టిక్ నివారణకై తనిఖీలు నిర్వహించగా, అదే ప్రాంతంలో ఉన్న గంగై అమ్మన్ దేవాలయం వెనుక వైపున్న ఓ దుకాణ గోదాములో అక్రమంగా నిల్వ ఉంచిన 10 టన్నుల ప్లాస్టిక్ సంచులు, టీకప్పులు, ప్లేట్లను స్వాధీన పరుచుకొని, గోదాము యజమానిపై రూ.లక్ష అపరాధ రుసుము విధించారు. ఇదిలా ఉండగా తనిఖీలు జరుగుతున్న సమయంలో గోదాము యజమాని పారిపోయాడు. ఈఘటనపై కేసు నమోదు చేసుకున్న మాంగాడు పోలీసులు గోదాము యజమాని కోసం గాలిస్తున్నారు.

గ్యాస్ ట్యాంకర్ బోల్తా కేసు లారీ డ్రైవర్ అరెస్టు

ఐసిఎఫ్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కోవైలోని ఒప్పిలిపాళెం వంతెనపై గ్యాస్ ట్యాంకర్ బోల్తాపడిన సంఘటనకు సంబంధించి లారీ డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. గత శుక్రవారం ప్రమాదానికి గురై అందులోని గ్యాస్ లీకైంది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది సుమారు 11 గంటలకు పైగా తీవ్రంగా శ్రమించి, గ్యాస్ లీకైన లారీట్యాంకర్ తొలగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ రాధాకృష్ణన్‌ను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరచి అనంతరం జైలుకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో నవ దంపతుల మృతి

వాషర్‌మెన్‌పేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో నవ దంపతులు మృతిచెందారు. కడలూరు జిల్లా జయంకొండాంకు చెందిన ఎస్‌ఐ ఇలవరసి, కలైవేందన్‌లకు రెండు నెలల క్రితం వివాహమైంది. ఈ నేపథ్యంలో, భార్యాభర్తలు ఘటన జరిగిన రోజున ద్విచక్రవాహనంపై వెళుతుండగా, జయంకొండాం సమీపంలో వీరివాహనాన్ని బస్సు ఢీకొన్న ఘటనలో, దంపతులు మృతిచెందారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

మహిళలే సమాజ ప్రగతికి వెలుగుదివ్వెలు

- రెవ.జడ వసంతబాబు


పేదలకు సహాయాలు పంపిణీ చేస్తున్న జడ వసంతబాబు

ప్యారీస్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మహిళలే సమాజ ప్రగతికి వెలుగుదివ్వెలని క్రిస్టియన్ బిలీవర్స్ ఫెలోషిప్ (సీబీఎఫ్) కాపరి రెవ.జడ వసంతబాబు పేర్కొన్నారు. 2025 తొలి ఆదివారం కొరుక్కుపేట కామరాజర్ నగర్‌లోని సీబీఎఫ్ సంఘంలో విశ్వ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వితంతువులు, హిజ్రాలు, పేద కుటుంబాలకు సంక్షేమ సహాయాలు పంపిణీ, సీనియర్లకు సన్మాన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

నిమిషాల్లో ప్రత్యేక రైళ్ల టిక్కెట్ల బుకింగ్

అడయార్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పొంగల్‌ను పురస్కరించుకుని దక్షిణాది జిల్లాలకు దక్షిణ రైల్వే పలు ప్రత్యేక రైళ్లను నడుపనుంది. ఇందులోభాగంగా నాలుగు ప్రత్యేక రైళ్లకు రిజర్వేషన్ బుకింగ్ ఆదివారం ఉదయం ప్రారంభమైంది. ఈ బుకింగ్ ప్రారంభమైన కేవలం ఐదే ఐదు నిమిషాల్లో అన్ని టిక్కెట్లు అయిపోయాయి. దీంతో సంక్రాంతి రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణాది జిల్లాలకు మరిన్ని ప్రత్యేక రైళ్లను నడపాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

జాలర్ల వలలో చిక్కిన అరుదైన చేప



ప్యారీస్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తిరువారూర్ జిల్లా ముత్తుపేటలోని సముద్రతీర సంగమం ప్రాంతంలో చేపలు పడుతున్న మత్స్యకారుల వలకు అరుదైన షీనిడే జాతికి చెందిన 25కిలోల రూఫ్‌క్యాట్ ఫిష్ దొరికింది. దాదాపు 30 కిలోల వరకు పెరిగే ఈ చేప దొరకితే మత్స్యకారులకే నోరూరుతుంది. ఎన్నో ఔషధగుణాలు కలిగి, చర్మవ్యాధులు, గుండె సంబంధిత వ్యాధుల నుండి ఉపసమనాన్ని పొందేలా చేసే ఈ చేపలో రోగనిరోధక శక్తి పెంపొందించే ప్రోటీన్లుంటాయని మత్స్యకారులు తెలిపారు. ఈ చేపకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందని వారు హర్షం వ్యక్తం చేశారు. అందుకే అ చేపలు మార్కెట్‌లోని వచ్చినప్పుడల్లా దానిని ధరతో సంబంధం లేకుండా కొనుగోలు చేస్తారన్నారు.

సీఎం కార్యక్రమంలో నల్ల దుప్పట్టా నిషేధం


ప్యారీస్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎగ్మూర్‌లోని ప్రభుత్వ మ్యూజియంలో ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదివారం పాల్గొన్న కార్యక్రమంలో విద్యార్థినులు నల్ల దుప్పట్టా దరించడంపై నిషేధం విధించారు. సింధులోయ నాగరికత ఆవిష్కరణ శతవార్షికోత్సవాలు ముగింపు వేడుకల అంతర్జాతీయ సదస్సు ఆదివారం ఎగ్మూర్ మ్యూజియంలో జరిగింది. ముఖ్యమంత్రి స్టాలిన్ పాల్గొనకముందే, నల్ల దుప్పట్టాలతో విద్యార్థినులు హాజరయ్యారు. అక్కడున్న భద్రతా విభాగం పోలీసులు, విద్యార్థినులు ధరించిన నల్ల దుప్పటాలు స్వాధీనం చేసుకుని, కార్యక్రమం తర్వాత తిరిగి అప్పగించారు. ఇదిలా ఉండగా, నీట్ కేంద్రాలకు వెళ్లే విద్యార్థినులకు నల్ల దుప్పట్టా ధరించరాదని విధించిన నిషేధాన్ని గతంలో ముఖ్యమంత్రి స్టాలిన్ తీవ్రంగా ఖండించారు. ఈ నేపథ్యంలో, ఆదివారం సీఎం పాల్గొన్న కార్యక్రమంలో నల్ల దుప్పటా ధరించడం నిషేధింపడంపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి.

'పుల్లింగో' విద్యార్థులకు కటింగ్ చేయించిన ఆర్డీవో


విద్యార్థులకు కటింగ్ చేస్తున్న దృశ్యం

పెరంబూర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు 'పుల్లింగో' పేరుతో రకరకాల వింత కటింగ్‌తో వస్తున్న విద్యార్థులకు ఆర్డీవో దగ్గరుండి కటింగ్ చేయించారు. కడలూరు జిల్లాలో శనివారం బన్రూటి ప్రభుత్వ పాఠశాలను ఆర్డీవో అభినయ తనిఖీ చేశారు. ఆ సమయంలో ప్లస్ టూ తరగతి గదిలో పలువురు విద్యార్థులు పుల్లింగో కటింగ్‌తో ఉండడం ఆమె గమనించారు. ఈ విషయమై ఆర్డీవో అభినయ ప్రశ్నకు ప్రధానోపాధ్యాయుడు ఆలమరసెల్వం బదులిస్తూ, విద్యార్థులు పలుమార్లు చెప్పినా ఫలితం లేకపోయిందని పేర్కొన్నారు. దీంతో, ఆర్డీవో క్షురకులను పాఠశాలకు రప్పించి, 25 మంది విద్యార్థులకు కటింగ్ చేయించారు.

చెరకు గడల పరిశీలన


చెరకు గడలను పరిశీలిస్తున్న కలెక్టర్ సిబి ఆదిత్య సెంథిల్‌కుమార్

పెరంబూర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి చెరకు గడల కొనుగోలుకు జిల్లా కలెక్టర్ సిబి ఆదిత్య సెంథిల్‌కుమార్ స్వయంగా పరిశీలించారు. పొంగల్ సందర్భంగా బియ్యం కార్డుదారులకు కిలో పచ్చిబియ్యం, కిలో చక్కెర, ఒక చెరకు గడ ఇవ్వనున్నట్లు సీఎం స్టాలిన్ ప్రకటించారు. చెరకు గడలను రైతుల నుంచి కొనుగోలు చేయాలని, ఆయా జిల్లా కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ క్రమంలో, కడలూరు జిల్లా కలెక్టర్ ఆదిత్య సెంథిల్‌కుమార్ శనివారం కుల్లుంచావిడి సమీపం కోరనపట్టు గ్రామంలోని పొలాలకు వెళ్లి చెరకు గడలను పరిశీలించారు. నాణ్యతను బట్టి చెరకు గడకు ధర అందజేస్తామని, రైతులకు లబ్దిచేకూరాలనే ఉద్దేశంతో నేరుగా వారి వద్దకే వెళ్లి కొనుగోలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

ఉప ఎన్నిక తేది ప్రకటించాక పోటీపై నిర్ణయం

- టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్

పెరంబూర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ తూర్పు శాసనసభ ఉప ఎన్నికలో పోటీచేయడంపై, ఎన్నిక తేది ప్రకటించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని తమిళ మానిల కాంగ్రెస్ (టీఎంసీ) అధ్యక్షుడు జీకే వాసన్ తెలిపారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. అన్నా వర్సిటీ వ్యవహారంలో ప్రతిపక్షాలు రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదన్నారు. బాధిత విద్యార్థి, ఆమె తల్లిదండ్రులకు అండగా నిలిస్తే చాలన్నారు. ఈ కేసు విచారణ సీబీఐకి బదిలీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా షణ్ముగం


నూతన రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం

పెరంబూర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా పి.షణ్ముగం ఎంపికయ్యారు. ఆ పార్టీ 24వ రాష్ట్ర మహాసభలు విల్లుపురంలో గత ఈ నెల 3వ తేది ప్రారంభమయ్యాయి. తొలిరోజు ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించగా, ఆ పార్టీ జాతీయ సమన్వయకర్త ప్రకాష్ కారత్, జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు బృందాకారత్, ఎంఎ బేబి, జాతీయ కమిటీ సభ్యులు వాకి, కె.రామకృష్ణన్ సహా పలువురు పాల్గొన్నారు. శని, ఆదివారాల్లో రాష్ట్ర ప్రతినిదులు సమావేశాలు జరిగాయి. కాగా, ప్రస్తుతం రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న కె.బాలకృష్ణన్, తనను పదవి నుంచి విడిపించాలని జాతీయ కమిటీకి విజ్ఞప్తి చేశారు. ఆయన అభ్యర్థ పరిశీలించిన అధిష్ఠానం, రాష్ట్ర కార్యదర్శిగా పి.షణ్ముగంను ఎంపిక చేసింది. కాగా, షణ్ముగం, పార్టీ అనుబంధ యువజన సంఘం డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. ప్రస్తుతం రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా వ్యవహరిస్తున్న ఆయన, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా ఉన్నారు.

ఆమ్నీ బస్సుల తనిఖీకి 30 బృందాలు

పెరంబూర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పొంగల్ పండుగ సందర్భంగా, అధిక ఛార్జీలు వసూలుచేసే ఆమ్నీ బస్సుల తనిఖీకి 30 ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసినట్లు రవాణా శాఖ తెలిపింది. ఈ విషయమై ఆ శాఖ అధికారులు మాట్లాడుతూ.. పండుగ సందర్భంగా ప్రజలు స్వగ్రామాలకు వెళుతుంటారని, ఇదే అదనుగా ఆమ్నీ బస్సులు అధిక ఛార్జీలు వసూలుచేస్తుంటాయన్నారు. రిజిస్ట్రేషన్ లేని, పన్ను చెల్లించని, పర్మిట్ లేని బస్సులను కూడా వాటి యజమానులు నడుపుతున్నారనే ఫిర్యాదులున్నాయని తెలిపారు. నిబంధనలు అతిక్రమించి నడపడం, అధిక ఛార్జీలు వసూలుచేసే ఆమ్నీ బస్సుల్లో తనిఖీలు చేపట్టి తగిన చర్యలు చేపట్టేలా 30 ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసినట్లు రవాణా శాఖ తెలిపింది.

ఎంపీ వెంకటేశన్‌కు అస్వస్థత



ప్యారీస్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మదురై ఎంపీ వెంకటేశన్ అస్వస్థత కారణంగా విల్లుపురంలో ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. విల్లుపురంలో జరుగుతున్న సీపీఎం రాష్ట్ర మహాసభల్లో పాల్గొనేందుకు ఆదివారం ఉదయం వెళ్తున్న ఎంపీ వెంకటేశన్ హఠాత్తుగా గుండెపోటుకు గురయ్యారు. వెంటనే కార్యకర్తలు ఓ ప్రైవేటుఆస్పత్రికి తరలించారు. తక్షణ వైద్యం అందడంతో కోలుకోగా, సాయంత్రం ఆయనను డిశ్చార్జి చేసినట్లు వైద్యులు తెలిపారు.

రక్తదాన శిబిరానికి స్పందన


రక్తదాన శిబిరం ప్రారంభోత్సవంలో ప్రొఫెసర్ సీఎంకే రెడ్డి, నాయకర్ నందగోపాల్ తదితరులు

ప్యారీస్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక కొరట్టూరులోని డా.నల్లి కుప్పుస్వామి వివేకా విద్యాలయ ప్రాంగణంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని మహా రక్తదాన శిబిరం నిర్వహించారు. కొరట్టూరు పతంజలి యోగాసమితి, ఆర్ఎస్ఎస్-హెచ్ఎస్ఎస్, అఖిల భారత తెలుగు సమాఖ్య (ఏఐటీఎఫ్)ల సంయుక్తఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ శిబిరాన్ని ఏఐటీఎఫ్ అధ్యక్షులు ప్రొఫెసర్ సీఎంకే రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సాగిన ఈ శిబిరంలో సుమారు 102 మంది రక్తదానం చేయగా, వారికి ప్రశంసాపత్రాలను నిర్వాహకులు పంపిణీ చేసి అభినందించారు.

యువతిపై యాసిడ్ దాడి... ముద్దాయికి రెండు జీవిత శిక్షలు

అడయార్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తిరునెల్వేలి జిల్లా సీవలప్పేరి సమీపంలో యువతిపై అత్యాచార యత్నానికి పాల్పడటంతో పాటు యాసిడ్ దాడి కేసులో నిందితుడికి స్థానిక కోర్టు రెండు యావజ్జీవ కారాగార శిక్షలను విధించింది. చిన్నరాసు (38) అనే వ్యాను డ్రైవర్ ఓ యువతిపై అత్యాచార యత్నానికి ప్రయత్నించి, విఫలమయ్యాడు. దీంతో ఆ యువతిని హత్య చేసేందుకు కుట్రపన్ని యాసిడ్ దాడికి పాల్పడ్డాడు. 2016లో జరిగిన ఘటనకు సంబంధించిన ఈ కేసు విచారణ నెల్లై జిల్లా మహిళా కోర్టులో సాగింది. కేసులోని సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి పన్నీర్‌సెల్వం (ఇన్‌చార్జ్) ఏడేళ్లపాటు రెండు జీవితకారాగార శిక్షలను విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ రెండు శిక్షలను ఏక కాలంలో అనుభవించాలని ఆదేశించారు.

కుమరికి హెలికాప్టర్‌లో ఉమ్మడి ఏపీ మాజీ మంత్రి


కన్నియాకుమారిలో మాజీ మంత్రి దేవేంద్ర గౌడ్

పెరంబూర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి దేవేంద్రగౌడ్ శనివారం హెలికాప్టర్‌లో కన్నియాకుమారికి వచ్చారు. అక్కడి వివేకానంద కళాశాల మైదానంలో హెలికాప్టర్ ల్యాండింగ్ అయింది. ఆయన భద్రతా అధికారులు మరో హెలికాప్టర్‌లో వచ్చారు. అనంతరం కన్నియాకుమారి భగవతి అమ్మవారి ఆలయంలో దేవేంద్ర గౌడ్ ప్రత్యేక పూజ చేశారు. అలాగే, కన్నియకుమారి సముద్రంలో ఏర్పాటుచేసిన వివేకానంద మండపం, తిరువళ్లువర్ విగ్రహం, ఈ రెండింటిని అనుసంధానం చేసేలా నిర్మించిన అద్దాల వంతెన తదితరాలను ఆయన వీక్షించారు. అక్కడి నుంచి ఆయన రామేశ్వరం ఆలయ సందర్శనకు వెళ్లారు. తొలుత కన్నియాకుమారికి వచ్చిన మాజీ మంత్రికి జిల్లా పర్యాటక శాఖ అధికారి కామరాజ్ స్వాగతం పలికారు. భారీ భద్రత మధ్య మాజీ మంత్రి కన్నియాకుమారి రావడం ఆశ్చర్యానికి గురిచేసింది.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణి


పేదలకు సరకులు అందజేస్తున్న డా.పాల్ రంగనాథన్

ప్యారీస్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నానగర్ వెస్ట్ ఎక్స్‌టెన్షన్‌లో ఉన్న క్రీస్తు సంఘం తరపున ఆదివారం పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. వరల్డ్ బైబిల్ కాలేజీ డైరెక్టర్ రెవ.డా.పాల్ రంగనాథన్ ప్రతి ఏడాదిలాగే ఈ నూతన సంవత్సరం సందర్భంగా సుమారు 300 మందికి పైగా 5 కిలోల బియ్యం, ఆహార వస్తువులు, నిరుపేదలకు నగదు సాయం అందజేశారు.

శిశువులకు బంగారు ఉంగరాలు


బంగారు ఉంగరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే చంద్రన్

తిరుత్తణి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి తూర్పు మండల డీఎంకే ఆధ్వర్యంలో బీరకుప్పం పీహెచ్‌సీలో జన్మించిన శిశువులకు ఎమ్మెల్యే చంద్రన్ బంగారు ఉంగరాలు అందజేశారు. ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి జన్మదినం రోజున ప్రభుత్వాసుపత్రుల్లో జన్మించిన శిశువులకు బంగారు ఉంగరం అందజేయనున్నట్లు డీఎంకే ప్రకటించింది. ఈ ప్రకారం, బీరకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జన్మించిన నలుగురు శిశువులకు ఎమ్మెల్యే ఆదివారం ఉంగరాలు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి రాజేంద్రన్ సహా పలువురు నేతలు, కార్యకర్తలు, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఫెంగల్' తీవ్రమైన ప్రకృతి విపత్తు

- ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం

చెన్నై, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను తీవ్రమైన ప్రకృతి విపత్తుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దీని ద్వారా విపత్తు నిధితో పాటు ఇతర నిధులను పునరావాస చర్యలకు వినియోగించుకోవచ్చు. గత ఏడాది నవంబరు 30న ఫెంగల్ తుఫాను తీరం దాటిన విషయం తెలిసిందే. తుఫాను ప్రభావంతో విల్లుపురం, కళ్లకుర్చి, కడలూరు, తిరువణ్ణామలై, ధర్మపురి, కృష్ణగిరి జిల్లాల్లో అతి భారీవర్షాలు కురిశాయి. ఇళ్లు, పంట పొలాలు నీట మునిగాయి. ఈ విపత్తులో మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.5 లక్షలు, బాధిత కుటుంబాలకు రూ.2 లక్షలు సాయంగా ప్రభుత్వం అందజేసింది. సహాయ చర్యలకు నిధులు కేటాయించాలంటూ కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో, ఫెంగల్ తుఫాను తీవ్రమైన ప్రకృతి విపత్తుగా ప్రకటించి, తమిళనాడు విపత్తు నిర్వహణ విభాగం గెజిట్‌లో ప్రచురించారు.

పాఠశాల ధ్వంసం కేసులో విద్యార్థి సహా ఇద్దరి అరెస్ట్

చెన్నై, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పాఠశాల ధ్వంసం కేసులో ప్లస్ వన్ విద్యార్థి సహా ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. కల్పాక్కం ప్రాంతంలోని ప్రభుత్వ మహోన్నత పాఠశాలలోకి రెండు రోజుల క్రితం ప్రవేశించిన గుర్తుతెలియని వ్యక్తులు హెచ్ఎం గదిలోని కంప్యూటర్, బీరువాలోని వస్తువులు, సీసీ కెమెరాలు, సైన్స్ ల్యాబ్ పరికరాలు, బయోమెట్రిక్ పరికరం సహా పలు రిజిస్టర్లు ధ్వంసం చేసి పరారయ్యారు. ఈ విషయమై పాఠశాల హెచ్ఎం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు సరైన చర్యలు చేపట్టలేదంటూ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తరగతులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. దీంతో, విచారణ చేపట్టిన పోలీసులు, ఈ పాఠశాల పూర్వ విద్యార్థి, మరో విద్యార్థిని అరెస్టు చేశారు.

కోయంబేడు మార్కెట్లో పొంగల్ సంతకు ఏర్పాట్లు

ఐసిఎఫ్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడు మార్కెట్‌లో సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు సంత జరగనుంది. ఈ సంతలో చెరకు, ముగ్గుల రంగులు, బూడిద గుమ్మడి కాయలు, టెంకాయలు, మామిడి తోరణాలు, పూలు తదితర పూజా సామగ్రి విక్రయించనున్నారు. ఈ మార్కెట్‌లో నగర వ్యాపారులే కాక, ఇతర జిల్లాలైన కడలూరు, పుదుచ్చేరి, విల్లుపురం, మదురై జిల్లాల నుండి సుమారు 100 మంది హోల్‌సేల్ వ్యాపారులు ప్రత్యేక స్టాల్స్‌ను నిర్వహించనున్నారు. అధిక సంఖ్యలో ప్రజలు మార్కెట్ వచ్చే క్రమంలో, జనాభా రద్దీని దృష్టిలో ఉంచుకొని పోలీసు భద్రతా ఏర్పాట్లు చేపట్టనున్నారు.



తమిళ చిత్రజ్యోతి

'నేసిప్పాయ' సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్

సినిమా కోసం శ్రమించండి...

● మీ డాడీ స్థానం దక్కుతుంది ● హీరో ఆకాష్‌కు ఎస్కే సూచన

చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టిన తర్వాత సర్వశక్తులు ధారపోస్తే ఉన్నతస్థానానికి చేరుకోవడమేకాకుండా, మీ తండ్రి దివంగత మురళికి ఇచ్చిన స్థానాన్ని తమిళ ప్రేక్షకులు మీకు కూడా ఇస్తారని యంగ్ హీరో ఆకాష్ మురళికి మరో హీరో శివకార్తికేయన్ సూచించారు. ఎక్స్‌బీ ఫిలిమ్స్ పతాకంపై జేవియర్ బ్రిట్టో, స్నేహా బ్రిట్టో సంయుక్తంగా ఆకాష్ మురళిని హీరోగా పరిచయం చేస్తూ నిర్మించిన చిత్రం 'నేసిప్పాయ'. అతిది శంకర్ హీరోయిన్. యువన్ శంకర్ రాజా సంగీతం అందించిన ఈ సినిమాకు విష్ణువర్ధన్ దర్శకుడు. ఆర్.శరత్ కుమార్, ప్రభు గణేశన్ ముఖ్య పాత్రలను పోషించారు. పొంగల్ పండుగను పురస్కరించుకుని ఈ నెల 14న విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ తాజాగా నగరంలో జరిగింది. ఈ కార్యక్రమానికి 'అమరన్' ఫేం శివకార్తికేయన్‌తో బడా నిర్మాత కలైపులి ఎస్.థాను, హీరో విజయ్ ఆంటోనీ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ వేడుకలో శివకార్తికేయన్ మాట్లాడుతూ, 'ప్రతి ఒక్కరి జీవితాల్లో మామగారితో బంధం ప్రత్యేకంగా ఉంటుంది. ఇది ఆకాష్‌కు కుదిరింది. మంచి చిత్రాల్లో నటించాలన్న ఆశ ఆకాష్‌కు ఉంది. దానికి పూర్తి సహాయ సహకారాలు అందించే మామ లభించడం అతడి అదృష్టం. ఆకాష్ నటించిన తొలి చిత్రమే సంక్రాంతికి విడుదలకానుంది. అన్నీ అనుకూలంగానే కుదిరాయి. తొలి బంతినే సిక్సర్‌గా కొట్టండి' అని సూచించారు.

పొంగల్ రేస్ నుంచి తప్పుకున్న మరో మూడు చిత్రాలు

పొంగల్ రేస్ నుంచి మరో మూడు చిత్రాలు తప్పుకున్నాయి. అజిత్ నటించిన 'విడాముయర్చి' చిత్రం విడుదల వాయిదా వేస్తున్నట్టు నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్ డిసెంబరు 31వ తేదీ రాత్రి అధికారికంగా వెల్లడించిన విషయం తెల్సిందే. ఆ తర్వాత అనేక మంచి చిన్న నిర్మాతలు తమ చిత్రాలను విడుదల చేసేందుకు ముందుకు వచ్చారు. దీంతో పొంగల్‌కు పదికిపైగా సినిమాలు విడుదలవుతాయని భావించారు. కానీ, పండుగ సమయం సమీపించేకొద్దీ ఒక్కో చిత్రం వివిధ కారణాలతో తప్పుకుంటోంది. అలా ఇప్పటివరకు మూడు చిత్రాలు తప్పుకున్నాయి. వీటిలో దివంగత నటుడు విజయకాంత్ కుమారుడు షణ్ముగ పాండియన్ నటించిన 'పడై తలైవన్', సుశీంద్రన్ నిర్మించిన '2కే లవ్ స్టోరీ', సిబి నటించి 'టెన్ హవర్స్' ఉన్నాయి. వీటికి తగినన్ని థియేటర్లు లభించకపోవడంతో రిలీజ్ వాయిదా వేసుకున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. ఇదిలావుంటే, కోలీవుడ్ లెక్కల ప్రకారం ఈ సంక్రాంతికి ఈ నెల 10న 'వణంగాన్', 'మద్రాస్ కారన్', డబ్బింగ్ చిత్రం 'గేమ్ ఛేంజర్', జనవరి 12న 'మద గద రాజా', జనవరి 14న 'కాదలిక్క నేరమిల్లై', 'నేసిప్పాయా', 'తరుణం' విడుదలకానున్నాయి. అయితే, రిలీజ్ తేదీ దగ్గరకొచ్చే సరికి వీటిలో ఏ చిత్రాలు వెనక్కి తగ్గుతాయో వేచి చూడాలి.



'2కే లవ్ స్టోరీ'లో ఓ దృశ్యం



నూతన వధూవరులు సాక్షి - నవనీత్

గప్‌చిప్‌గా పెళ్ళిపీటలెక్కిన సాక్షి అగర్వాల్

'రాజా రాణి' సినిమా ద్వారా వెండితెరకు పరిచయమైన హీరోయిన్ సాక్షి అగర్వాల్ కొత్త సంవత్సరంలో చడీచప్పుడు లేకుండా పెళ్ళిపీటలెక్కేశారు. 15 యేళ్ళుగా ప్రేమించిన తన ప్రియుడు నవనీత్‌ను తాజాగా గోవాలో వివాహం చేసుకున్నారు. ఈ ప్రేమ పెళ్ళికి ఇరు కుంటుంబాలు అంగీకరించడంతో గోవాలోని ఓ హోటల్‌లో వీరి వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వివాహానికి రెండు కుటుంబాల సభ్యులు, సన్నిహితులు మాత్రమే హాజరయ్యారు. ఆ తర్వాత చిత్రపరిశ్రమకు చెందిన వారికి సినిమా పాత్రికేయులకు ఆమె ప్రత్యేకంగా రిసెప్షన్ ఏర్పాటుచేయగా, అనేక మంది సినీ సెలెబ్రిటీలు, మీడియా మిత్రులు నూతన వధూవరులను ఆశీర్వదించారు. అన్నా విశ్వవిద్యాలయం నుంచి గోల్డ్‌మెడలిస్ట్ పొందిన సాక్షి అగర్వాల్ సినిమా రంగంపై ఉన్న మక్కువతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. ఈ క్రమంలో బాల్య స్నేహితుడైన నవనీత్‌ను ఆమె ప్రేమ వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం సాక్షి అగర్వాల్ తమిళ, మలయాళం, కన్నడ భాషా చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంటున్నారు.

చిత్రీకరణ పూర్తి చేసుకున్న 'టూరిస్ట్ ఫ్యామిలీ'

అభిషణ్ జీవిత్ దర్శకుడిగా పరిచయమవుతూ రూపొందిస్తున్న చిత్రం 'టూరిస్ట్ ఫ్యామిలీ' చిత్రీకరణ పూర్తి చేసుకుంది. శశికుమార్, సిమ్రన్, యోగిబాబు, మిథున్ జయశంకర్, కమలేష్, ఎం.ఎస్.భాస్కర్, రమేష్ తిలక్, బక్స్, ఇళంగో కుమరవేల్, శ్రీజా రవి తదితరులు నటించారు. ఇటీవల మూవీ టీజర్ రిలీజ్ చేయగా, మంచి రెస్పాన్స్ వచ్చింది. దీంతో సినిమా పంపిణీ హక్కులను సొంతం చేసుకునేందుకు డిస్ట్రిబ్యూటర్లు పోటీపడుతున్నారు. మిలియన్ డాలర్ స్టూడియోస్, ఎంఆర్‌బీ ఎంటర్‌టైన్మెంట్ సంయుక్తంగా కుటుంబ నేపథ్యంలో హాస్యభరిత చిత్రం నిర్మిస్తున్నాయి. ఇపుడు పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులు పూర్తి చేసి విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాయి.

'టూరిస్ట్ ఫ్యామిలీ' చిత్ర బృందం →



మురుగన్ ఆలయాలకు పోటెత్తిన భక్తులు



తిరుచెందూరు సముద్రతీరంలో స్నానమాచరించేందుకు గుమికూడిన భక్తులు



పళని ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు



తిరుచెందూరు ఆలయం వద్ద నోటికి శూలాన్ని గుచ్చుకుని మొక్కు చెల్లించేందుకు వెళ్తున్న భక్తుడు

చెన్నై, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తమిళుల ఆరాధ్యదైవం మురుగప్పెరుమాన్ కొలువుదీరిన తిరుచెందూరు సెంథిల్ ఆండవర్ ఆలయం, పళని దండాయుధపాణి ఆలయానికి ఆదివారం ఉదయం భక్తులు తరలివెళ్ళారు. సముద్రతీరానికి చేరువగా ఉన్న తిరుచెందూరు ఆలయంలో శనివారం అర్ధరాత్రి నుండే భక్తుల సందడి పెరిగింది. తూత్తుకుడి, తెన్‌కాశి, శంకరన్‌కోవిల్, రాజపాళయం, విరుదునగర్ జిల్లాలకు చెందిన భక్తులు పాదయాత్రగా వంటికి శూలాలు గుచ్చుకుని, కావళ్లు మోసుకొచ్చి స్వామివారి దర్శనం చేసుకున్నారు. ప్రస్తుతం శబరిమల యాత్రకు వెళ్లే భక్తులు సంఖ్య కూడా విపరీతంగా పెరిగింది. ఆదివారం వారాంతపు సెలవు కావటంతో వేకువజాము నుండే భక్తులు బారులుదీరారు. వేకువజామునే సముద్రతీరంలో స్నానమాచరించి, నాళికినరు వద్ద పవిత్ర జలాలను శిరస్సుపై చల్లుకుని క్యూలైన్లలో నిలిచారు. వేకువజాము మూడు గంటలకే ఆలయాన్ని తెరిచారు. విశ్వరూపదర్శనానంతరం ఉదయమార్తాండాభిషేకం, ఇతర పూజలు నిర్వహించారు. భక్తుల సంఖ్య విపరీతంగా పెరగటంతో పలుచోట్ల ట్రాఫిక్ సమస్య కూడా ఏర్పడింది.

పళనిలో..

ఇదే విధంగా దిండుగల్ జిల్లాలోని పళని దండాయుధపాణి పర్వతాలయంలోనూ రెండు రోజులుగా భక్తుల రద్దీ విపరీతంగా ఉంది. ఆదివారం ఉదయం నుంచే పళనిలోని కొండదిగువ ప్రాంతం, బస్‌స్టేషన్ వద్ద, గిరివీధి, ఎలక్ట్రిక్‌లాంచ్ సెంటర్, రోప్‌కార్ సెంటర్, మెట్లదారి, ఏనుగు రహదారి తదితర ప్రాంతాల్లో భక్తులు గుమికూడారు. త్వరలో తైపూసవేడుకలు జరుగనుండటంతో దిండుగల్, తేని, మదురై, కారైక్కుడి, తిరుప్పూరు, కోయంబత్తూరు తదితర జిల్లాల నుండి వ్రతమాచరిస్తున్న భక్తులు కూడా అధిక సంఖ్యలో ఈ ఆలయానికి చేరుకుంటున్నారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో వేచిం ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అన్నమయ్య గీతాలతో అలరించిన కళాకారులు



ఉపేంద్రగుప్తా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అద్దేపల్లి బాలాజీ, విజయలక్ష్మి తదితరులు

● వీనులవిందుగా సుశృతి అఖండగానం

ప్యారీస్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన సుశృతి ఆధ్యాత్మిక సంగీత బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన 12వ వార్షిక అన్నమయ్య అఖండ గాన కార్యక్రమం సంగీతప్రియులను అలరించింది. ఆళ్వార్‌పేటలోని యతిరాజ కల్యాణ నిలయంలో జరిగిన సంగీత కార్యక్రమంలో దశావతారాలు, గోదాదేవి ప్రతిమలు, అన్నమయ్య చిత్రాలతో ఆధ్యాత్మిక శోభను తెచ్చేలా వేదికను అలంకరించారు. ఆదివారం ఉదయం 5 గంటలకు లక్ష్మీ అష్టోత్తరం, విష్ణు సహస్రనామ పారాయణం, తిరుప్పావై, రామాయణాలను భక్తిశ్రద్ధలతో ఆలపించారు. సుశృతి సంస్థ అధ్యక్షుడు అద్దేపల్లి బాలాజీ అధ్యక్షతన ఉదయం 6 గంటలకు ప్రేమ ఉపేంద్ర అఖండజ్యోతి ప్రజ్వలన చేసి, అన్నమయ్య అఖండగాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సుశృతి వ్యవస్థాపలకులు దివంగత టి.ఉపేంద్ర గుప్తా చిత్రపటానికి నిర్వాహకులు నివాళలర్పించారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సాగిన అ అఖండగానంలో తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, రాష్ట్రాలతో పాటు విదేశాలకు చెందిన 60 మందికి పైగా కళాకారుల బృందాలు పాల్గొని అన్నమాచార్య కీర్తనలను శ్రావ్యంగా ఆలపించారు. గానం, వీణా, వయోలిన్, కీబోర్డు, భరతనాట్యం, కోలాట ప్రదర్శనలతో పదకవితా పితామహుడైన అన్నమయ్యకు నీరాజనం పలికారు. ఈ సందర్భంగా అద్దేపల్లి బాలాజీ మాట్లాడుతూ, అన్నమయ్య అఖండగానం కార్యక్రమం ద్వారా అన్నమయ్య కీర్తనలను తమిళనాట ప్రజల్లోకి తీసుకువెళ్లాలనే సంకల్పంతో దివంగత ఉపేంద్ర గుప్తా ఆధ్యాత్మిక మ్యూజిక్ బృందాన్ని ఏర్పాటు చేశారన్నారు. 12ఏళ్లుగా ఆయన ఆశయాలకనుగుణంగా అఖండ గాన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపకురాలు జి.వైష్ణవి, ఉపాధ్యక్షులు జి.రాజేశ్వరి, పి.రేవతి, కార్యదర్శులు జె.విజయలక్ష్మీ, వీరా ప్రభాకర్, ట్రెజరర్ మీరాశేఖర్, జాయింట్ ట్రెజరర్ కె.సుకన్య తదితరులు కళాకారులను అభినందించి ప్రశంసా పత్రాలను అందించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు అందించారు.



సావర్కర్ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో బీజేపీ నేతలు

సావర్కర్ గొప్ప సంఘ సంస్కర్త

● బీజేపీ జాతీయ కార్యదర్శి బీఎల్ సంతోష్
● ఘనంగా సావర్కర్ పుస్తకావిష్కరణ

ప్యారీస్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొడంబాక్కం కన్నదాసన్ వీధిలోని చెన్నై సిటిజన్స్ ఫోరమ్‌లో సావర్కర్ జీవిత చరిత్ర పుస్తకాన్ని రాష్ట్ర బీజేపీ నేతలు ఆవిష్కరించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌జీ సూర్య రచించిన 'వీర సావర్కర్ ఒరు కళగకారనిన్ కతై' అనే పుస్తకావిష్కరణ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యదర్శి బీఎల్ సంతోష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై సహా పలువురు బీజేపీ రాష్ట్ర నాయకులు పుస్తకావిష్కరణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంతోష్ తొలి ప్రతిని అన్నామలైకి అందజేశారు. ఈ సందర్భంగా బీఎల్ సంతోష్ మాట్లాడుతూ, సావర్కర్ గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. ఈ క్రమంలో అన్నామలై మాట్లాడుతూ సావర్కర్ లాంటి గొప్పతనాన్ని రాష్ట్ర ప్రజలకు చాటిచెప్పేలా ఈ పుస్తకం ఉంటుందన్నారు. మన తర్వాతి తరాల వారికి దేశభక్తి పెంపొందించాలంటే సావర్కర్ లాంటి వారి గురించి తెలుసుకోవాలన్నారు. యువత సావర్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని అన్నామలై అన్నారు.


అరుణాచలేశ్వరుడి సేవలో అమెరికన్లు



భారతీయ సంప్రదాయ దుస్తులు ధరించి దర్శనానికి వెళుతున్న అమెరికన్ మహిళలు

ఐసీఎఫ్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ శైవక్షేత్రం తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయాన్ని అమెరికాకు చెందిన మహిళా భక్తులు దర్శించారు. భారతీయ సంప్రదాయంలో పట్టు చీర, నుదుట బొట్టు, తలలో పువ్వులు పెట్టుకుని క్యూలైన్‌లో వెళ్ళి అమ్మవారిని, స్వామివారిని దర్శనం చేసుకున్నారు. దర్శనం అనంతరం ఆలయ రాజగోపురం ఎదుట పద్మాసనం వేసుకుని కాసేపు ధ్యానం చేశారు. ఆ తర్వాత పరమశివుడిని కీర్తిస్తూ భజనపాటలను కూడా గానం చేశారు.

చిదంబరంలో 3 దశాబ్దాల తర్వాత తెప్పోత్సవం



జలకళ సంతరించుకున్న ఆలయ కొలను

పెరంబూర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): చిదంబరం జ్ఞానప్రకాశ కొలనులో 30 ఏళ్ల అనంతరం, నటరాజస్వామి వారి తెప్పోత్సవం జరుగనుంది. కడలూరు జిల్లా చిదంబరం నటరాజ స్వామి ఆలయంలో ఆరుద్ర దర్శనం, ఆణి తిరుమంజనం అని ఏడాదికి రెండు సార్లు వేడుకలు నిర్వహిస్తుంటారు. దర్శనం అనంతరం కన సభ నగర్‌లోని జ్ఞానప్రకాశ కొలనులో తెప్పోత్సవం నిర్వహిస్తుంటారు. కానీ, కొలనులో పూడికతీయకపోవడం, మురుగునీరు కలవడం తదితర కారణాలతో 30 ఏళ్లుగా తెప్పోత్సవం నిర్వహించలేదు. భక్తుల కోరిక మేరకు కొలను పునరుద్ధరణకు ప్రభుత్వం రూ.15 కోట్లు కేటాయించింది. అందులో రూ.3 కోట్లతో కొలనులో పూడికతీత, గట్లు పటిష్ఠత, విద్యుద్దీపాలతో వాకింగ్ ట్రాక్, కొలను మధ్యలో ఫౌంటైన్ తదితరాలు ఏర్పాటుచేశారు. ఇటీవల కురిసిన వర్షాలతో కొలను జలకళ సంతరించుకుంది. ఈ ఏడాది మార్గళి ఆరుద్ర దర్శనం వేడుకలు శనివారం ప్రారంభమయ్యాయి. ముగింపు రోజైన 15వ తేది, 30 ఏళ్ల అనంతరం జ్ఞానప్రకాశ కొలనులో తెప్పోత్సవం నిర్వహించనుండడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తిరుప్పావై పాశురాలతో నగర సంకీర్తన



నగరసంకీర్తనలో వెంకటాద్రి భజన సమాజం కళాకారులు

ప్యారీస్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మహావిష్ణువును స్తుతిస్తూ గోదాదేవి రచించిన పాశురాలను గానం చేస్తూ ఆదివారం ఉదయం ఉత్తర చెన్నైలో జరిగిన నగర సంకీర్తన ఆధ్యాత్మిక శోభ తెచ్చింది. కొలత్తూరు ఆర్‌టీఏ కార్యాలయ సమీపంలో పొన్నియమ్మన్ మేడు మోహన్ నగరాల్లో ఉన్న ఆనంద నిలయంలో ఆదివారం ఉదయం 6 గంటలకు ఆండాళ్, ఆళ్వార్ గోష్ఠి కార్యక్రమం పద్మావతి తాయారు సమేత వెంకటేశ్వర స్వామి వార్లకు ప్రత్యేక పూజలతో ప్రారంభమైంది. భక్తులు పార్థసారథి స్వామి ఆశీస్సులు, త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి మంగళశాసనాలతో వేంకటాద్రి భజన సమాజం కళాకారులు, భక్తులు, మోహన్ నగర్ వీధుల్లో నగర సంకీర్తన చేశారు. ఆండాళ్ పాశురాలను వల్లిస్తూ భజన బృందం పురవీధుల్లో భక్తి చాటారు. అ సందర్భంగా సమాజం నిర్వాహకులు కె.ఐశ్వర్య బృందం సంయుక్తంగా మాట్లాడుతూ, పవిత్ర ధనుర్మాస మహావిష్ణువు కటాక్షం కోసం లోక సంక్షేమార్థం సమాజం తరుపున నగర సంకీర్తన నిర్వహించారు. గోదాదేవి భక్తి గురించి తెలియజేయాలన్న సంకల్పంతో ధనుర్మాసంలో 30 పాశురాలను పారాయణం చేయటం మహాభాగ్యం అని అన్నారు.

ఘనంగా కేతిరెడ్డి జన్మదిన వేడుకలు



కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డిని సత్కరిస్తున్న ప్రముఖులు

ప్యారీస్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు తెలుగు యువశక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌లోని కార్యాలయంలో కేతిరెడ్డి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తమిళనాడులోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా తెలుగు వారు 15 కోట్ల మందికి పైగా ఉన్నారని, అయినప్పటికీ పాఠశాలల్లో తెలుగు మీడియం చదివే వారు ఇతర రాష్ట్రాలలో కంటే తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌లో తక్కువ మంది ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త మల్లికార్జున రెడ్డి, సినీ దర్శకుడు కిరణ్, హెచ్.రామ్‌లాల్, పి.ప్రవీణ్, కె.వెంకటేష్, పి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, చందన తదితరులు కేతిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

బంగారంతో చిదంబరం ఆలయ స్వర్ణ రథం

● స్వర్ణకారుడు ముత్తుకుమరన్ ప్రతిభ



ముత్తుకుమరన్ బుల్లి స్వర్ణ రథాన్ని పరిచయం చేస్తున్న దృశ్యం

ప్యారీస్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కడలూర్ జిల్లా చిదంబరం ప్రాంతానికి చెందిన ముత్తుకుమరన్ అనే స్వర్ణకారుడు 930 మిల్లీగ్రాములతో నటరాజ స్వామి వారి బుల్లి స్వర్ణ రథాన్ని రూపొందించి రికార్డు సృష్టించారు. చిదంబరం విశ్వనాథపిళ్లై వీధిలో నివసిస్తున్న ముత్తుకుమరన్ 9వ తరగతి వరకు మాత్రమే చదువుకుని, 12ఏళ్ల ప్రాయం నుంచే తండ్రితో కలిసి బంగారు ఆభరణాలను తయారు చేస్తున్నాడు. ఈ అనుభవంతో ఏదైన సాధించాలనే తపనతో ఆయన కొద్దిపాటి బంగారంతో చిన్న చిన్న నగలు, వస్తువులను తయారు చేసి పలువురి ప్రశంసలందుకున్నాడు. 2020 ఏప్రిల్‌లో 530 మిల్లీగ్రాముల బంగారంతో కరోనా వైరస్‌కు వ్యతిరేకంగా పోరాడిన వైద్యులు, పారిశుధ్య కార్మికులు, పోలీసు శాఖ, మాస్క్, భారతదేశ మ్యాప్‌తో కూడిన నమూనా రూపొందించారు. అంతేకాకుండా 660 మిల్లీగ్రాముల బంగారంతో అదే సంవత్సరం 12 పేజీల క్యాలెండర్, 2019 పార్లమెంటు ఎన్నికల సందర్భంగా ఓటర్లలో అవగాహన కల్పించే విధంగా ఒక గ్రామం 420 మిల్లీగ్రాముల బంగారంతో భారత పార్లమెంటు భవన నమూనా సృష్టించి రికార్డు నెలకొల్పారు. 2018లో ప్రపంచ ప్రసిద్ధి చెందిన మక్కా మదీనా భవనాల నమూనాను 620 మిల్లీగ్రాముల బంగారంతో సెంటీమీటర్ ఎత్తులోను, అల్లా పదాన్ని 10 మిల్లీగ్రాముల బంగారంతో అందంగా మలిచారు. ముత్తుకుమరన్ ప్రతిభను చూసిన చిదంబరం వాసులంతా ఆయనను ప్రశంసలంతో ముంచెత్తారు. తాజాగా 930 మి.గ్రా బంగారంతో నటరాజ స్వామి స్వర్ణ రథాన్ని రూపొందించి రికార్డు సృష్టించారు.



930 మిల్లీగ్రాములతో తయారైన స్వర్ణ రథం